సాక్షి
ఖమ్మం
ఆదివారం । 21 । జూలై । 2024



బదిలీలు ఉన్నట్టా.. లేనట్టా?

అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ తుది దశకు చేరినా ఎక్సైజ్ శాఖలో బదిలీలపై సందిగ్ధత నెలకొంది. 8లో



'ప్రభుత్వం'లోనే నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ వెల్లడించారు. 8లో



వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వర్షం కురిసే సూచనలు ఉన్నాయి. జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామి మూలవిరాట్‌తో పాటు స్వామి వారి పాదాలకు అర్చకులు పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత స్వామి, అమ్మ వార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం, ఆతర్వాత పల్లకీసేవ నిర్వహించగా రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయ కేంద్రాన్ని వినియోగించుకోండి

ఖమ్మం లీగల్: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా జిల్లా జైలులో ఏర్పాటుచేసిన న్యాయ సహాయ కేంద్రాన్ని విచారణ ముద్దాయిలు, ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు సూచించారు. ఖమ్మం రూరల్ మండలంలోని జిల్లా జైలును శనివారం సందర్శించిన ఆయన విచారణ ఖైదీలతో మాట్లాడారు. శిక్ష అనుభవిస్తున్న ముగ్గురు ఖైదీలకు న్యాయ అంశాలపై శిక్షణ ఇచ్చి వారిని పారా లీగల్ వలంటీర్లుగా న్యాయ సహాయ కేంద్రంలో నియమించినట్లు తెలిపారు. అంతేకాక లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు వారానికి నాలుగు సార్లు జైలును సందర్శించి అవసరమైన న్యాయ సహాయం అందిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సీఎం అభినందనలు



అలేఖ్యకు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం, మంత్రులు

బోనకల్: సివిల్స్‌లో 938వ ర్యాంక్ సాధించిన బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన సాయిఅలేఖ్యను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు రూ.లక్ష ప్రోత్సాహక బహుమతి అందజేశారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయిఅలేఖ్య తండ్రి ప్రకాశరావు మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబులగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కుమార్తెను ఐఏఎస్ లేదా ఐపీఎస్ చేయాలనే లక్ష్యంతో చిన్ననాటి నుండే ప్రత్యేకమైన శ్రద్ధ కనబర్చగా సాయి అలేఖ్య లక్ష్యాన్ని చేరుకుంది.

కూసుమంచిలో జూనియర్ కళాశాలకు గ్రీన్‌సిగ్నల్

- రేపటి నుంచి ప్రవేశాలు ప్రారంభం

కూసుమంచి: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గ కేంద్రమైన కూసుమంచిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈమేరకు ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే కూసుమంచిలోని రెవెన్యూ అకాడమీ భవనాన్ని కళాశాల నిర్వహణకు సిద్ధం చేయగా సోమవారం నుంచి ప్రవేశాలు స్వీకరించనున్నారు. అలాగే, సైన్స్, ఆర్ట్స్ గ్రూపులను బోధించేందుకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 12 మంది అధ్యాపకులు, మరో ఆరుగురు అధ్యాపకేతర సిబ్బందిని ఏడాది పాటు నియమించేందుకు ఇంటర్ బోర్డు ఈమేరకు అనుమతించింది. ఇక కళాశాలలో వసతుల కల్పన, ఉద్యోగుల వేతనాలకు రూ.7.17 కోట్లు కేటాయించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏళ్ల తరబడి విన్నవిస్తుండగా ఎట్టకేలకు కూసుమంచిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం కానుండటంతో విద్యార్థులతో పాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో చొరవ చూపిన పాలేరు ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆగలేదు.. తగ్గలేదు..

జిల్లాలో ఐదు రోజులుగా జోరువాన పడుతోంది. శుక్రవారం, శనివారాల్లోనైతే ఆగకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి వరద చేరింది. జిల్లాలో సగటున 4.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో నిన్నామొన్నటి వరకు బోసిపోయి కనిపించిన చెరువులు, ప్రాజెక్టులకు జలకళ వస్తోంది. డెడ్ స్టోరేజీకి చేరిన పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, వైరా రిజర్వాయర్లలోకి నీరు చేరుతుండడంతో రైతుల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది. అయితే, కొన్ని ప్రాంతాల్లో వరి, మిర్చి నారు మడుల్లో వర్షపునీరు చేరింది. అంతే కాకుండా రహదారులపైకి వరద చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



మత్తడి పోస్తున్న సత్తుపల్లిలోని బేతుపల్లి చెరువు

జిల్లా అంతటా జోరువాన

- నగటున 4.9 సెం.మీ. వర్షపాతం నమోదు
- పొంగి పొర్లుతున్న ప్రాజెక్టులు, చెరువులు
- రోడ్లపైకి చేరిన వరదతో ఇక్కట్లు
- అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

జలమయం

వర్షపునీరు లోతట్టు ప్రాంతాలకు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం–భీమవరం రహదారిపై వరద చేరగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బోనకల్ మండలంలోని చిన్నబీరవల్లి నుంచి రావల్లి మార్గంలో రహదారిపై నుంచి పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా ప్రజలు రాకపోకలకు అవస్థ ఎదుర్కొన్నారు. అలాగే, ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపునీరు చేరగా, వైరా 14వ వార్డులో పమ్మి ప్రసాద్ పెంకుటిల్లు కూలింది.

చెరువులు, ప్రాజెక్టులకు జలకళ

వైరా రిజర్వాయర్ నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. రిజర్వాయర్ నీటిమట్టం 18.4 అడుగులు కాగా శనివారం నాటికి 0.3 టీఎంసీల నీరు చేరడంతో 9.5 అడుగులకు చేరింది. సత్తుపల్లిలోని బేతుపల్లి చెరువు సామర్థ్యం 16అడుగులు కాగా గరిష్ట స్థాయికి నీరు చేరింది. అంతేకాక 4,424 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 10 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బేతుపల్లి ప్రత్యామ్నాయ కాల్వ(ఎన్‌టీఆర్ కెనాల్) నుంచి వేంసూరు మండలానికి వంద క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మధిర మండలంలోని జాలిముడి ప్రాజెక్టు, ఖమ్మం ప్రకాష్‌నగర్ వద్ద మున్నేరు చెక్‌డ్యామ్., ఏన్కూరు మండలం రేపల్లెవాడ, జన్నారం వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎర్రుపాలెం మండలంలోని కట్లేరుకు భారీగా వరదనీరు చేరుతోంది. అలాగే, సత్తుపల్లిలోని దామర చెరువు, లంకాసాగర్ ప్రాజెక్టులు అలుగు పోస్తున్నాయి. తల్లాడ మండలం రామానుజవరం నల్లచెరువు నిండుకుండలా మారింది.



న్యూలక్ష్మీపురం జెడ్పీహెచ్ఎస్ ఆవరణలోకి చేరిన వర్షపునీరు

ముందస్తు జాగ్రత్తలపై కలెక్టర్ ఆదేశం

జిల్లాలో శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు సగటున 4.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వేంసూరులో 7.9 సెం.మీ. వర్షం కురవగా.. కొణిజర్లలో 2.4 సెం.మీ. వర్షమే కురిసింది. అయితే, శనివారం రోజంతా వర్షం కురుస్తూనే ఉండగా. ఆదివారం కూడా ఇదే పరిస్థితి ఉండొచ్చని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు. రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న వాగులు, రహదారులపైకి నీరు చేరిన చోట ప్రమాదాలు జరగకుండా సిబ్బందిని కాపలా ఉంచాలని, ఎవరూ రాకపోకలు సాగించకుండా బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయించాలని సూచించారు. కూలిపోయే దశలో ఉన్న ఇళ్లలోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు.

అత్యధిక వర్షపాతం ఇక్కడే..

జిల్లాలో శుక్రవారం ఉదయం 8నుంచి శనివారం ఉదయం 8గంటల వరకు అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాల వివరాలిలా ఉన్నాయి. వేంసూరులో 7.9 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, కామేపల్లిలో 7.6, కారేపల్లిలో 6.8, పెనుబల్లిలో 6.2, సత్తుపల్లిలో 6.1, ఏన్కూరులో 5.8, కల్లూరులో 5.8, మధిరలో 5.5, తిరుమలాయపాలెంలో 5.4, చింతకానిలో 5.1, తల్లాడలో 4.8 సెం.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. ఇక శనివారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంలోని ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్ ప్రాంతంలో 2.8 సెం.మీ. గేట్ కారేపల్లి, కల్లూరులో 1.7 సెం.మీ., వేంసూరు, గుబ్బగుర్తిల్లో 1.5, లింగాల, సత్తుపల్లిలో 1.4, గంగారం, బచ్చోడులో 1.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

పంటలకు నష్టం



వైరా మండలం లింగన్నపాలెంలోని పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

విడవకుండా కురుస్తున్న వర్షంతో పత్తి, మిర్చి నారుమడులకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో మిర్చి, నారుమడులు పోశారు. ప్రస్తుతం ఇందులోకి నీరు చేరింది. తిరుమలాయపాలెం మండలం ఎదుళ్లచెరువులోని మిర్చి నారుమడుల్లో నీరు నిలవగా, వేంసూరు మండలం భీమవరంలో పంటపొలాలు పూర్తిగా నీట మునిగాయి. తల్లాడ, కొణిజర్ల, వైరా మండలాల్లోని పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.



ఎర్రుపాలెం మండలంలోని కట్లేరుకు భారీగా చేరుతున్న వరద

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్



కంట్రోల్ రూమ్‌లో విధుల్లో అధికారులు, సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యాన కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్‌లోని 1077, 9063211298 నంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. ఇక్కడ 24గంటల పాటు ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం..

- దోమల నివారణకు ఫాగింగ్
- మురుగు నిలిచే చోట కచ్చా కాల్వలు
- 'సాక్షి' ఫోన్‌లో ఇన్‌లో వైరా మున్సిపల్ కమిషనర్ వేణు

సాక్షి ఫోన్ ఇన్



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చింతల వేణు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తామని కమిషనర్ చింతల వేణు వెల్లడించారు. పక్కా డ్రెయినేజీలు లేని చోట కచ్చా కాల్వలు తీయించి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు 'సాక్షి' ఆధ్వర్యాన నిర్వహించిన ఫోన్ ఇన్‌లో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రధానంగా తాగునీరు, డ్రెయిన్లు, సీసీ రోడ్లతో పాటుగా శానిటేషన్, పారిశుద్ధ్య సమస్యలను వివరించగా పరిష్కారానికి కమిషనర్ హామీ ఇచ్చారు. ఇందులో కొందరి సమస్యలు, కమిషనర్ చెప్పిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న : ఒకటో వార్డు మారుతి రైస్‌మిల్లు వెనక పక్కా డ్రెయినేజీ లేక మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది.– మురళి

కమిషనర్ : పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు కచ్చా కాల్వ తీయించి మురుగు సాఫీగా సాగేలా చర్యలు తీసుకుంటాం.

ప్ర: 18, 19వ వార్డులకు 20రోజుల నుండి చెత్త బండి రావడం లేదు. వీధిలైట్లు కూడా లేక చీకటి అలుముకుంటోంది.

– అనుమోలు రామారావు, సీఐటీయూ నాయకుడు

క: వార్డు మొత్తం ఫాగింగ్ చేయడంతో పాటు వీధిలైట్లు వేయిస్తాం. చెత్త బండి ఎందుకు రావడం లేదో కారణాలు ఆరా తీస్తాం.

ప్ర: రెండో వార్డులో చెరువు నీరు ఇళ్లలోకి వస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. – వల్లపు రాము

క: జేసీబీతో కాల్వలు తీయించి చెరువు నీరు ఇళ్లలోకి రాకుండా చూస్తాం.

ప్ర: 6వ వార్డు, సుందరయ్యనగర్‌లోని పెన్షనర్ భవనం సమీపంలోని డ్రెయినేజీలు లేక, పాత కూరగాయల మార్కెట్ డ్రెయిన్‌లోకి సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు వదులుతండడంతో దుర్వాసన వస్తోంది.

– కొంగర వెంకట్రావు, సంక్రాంతి చంద్రశేఖర్

క: డ్రెయిన్లలో సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు వదిలే వారిని గుర్తించి నోటీసులు ఇస్తాం. మళ్లీ సమస్య పునరావృతమైతే జరిమానా విధిస్తాం.

ప్ర: 19వ వార్డులోని లాలాపురం మసీదు వీధిలో రోడ్డు పక్కన ఉన్న పెంటదిబ్బల నుండి మురుగు నీరు సిమెంట్ రోడ్డుపైకి చేరుతోంది. – గోపాలరావు, 19వ వార్డు

క: జేసీబీతో కచ్చా కాలువ తీయించి మురుగు నీరు పారకుండా చర్యలు తీసుకుంటాం.

ప్ర: చిన్నవర్షం పడినా 12వ వార్డులో రోడ్డుపైకి నీరు చేరుతోంది. సైడ్ డ్రెయిన్లను 30 ఏళ్ల క్రితం నిర్మించడంతో ధ్వంసమయ్యాయి. ఇదే వార్డులో ఎస్సీ బాలికలు, బాలుర హాస్టళ్లు ఉన్నందున విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

– రెడ్డబోయిన శ్రీనివాసరావు

క: 12వ వార్డులో రోడ్డు సమస్య ఉన్న మాట వాస్తవమే. ప్రత్యేక నిధుల కోసం ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో మాట్లాడాం. నిధులు మంజూరైతే తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరిస్తాం.

ప్ర: ఖాళీ ప్లాట్లలో వర్షపు నీరు, చెత్తాచెదారంతో పేరుకుపోయి ఇబ్బంది అవుతుంది. పాములు కూడా తిరుగుతున్నాయి. రోజుల తరబడి చెత్త తీయడం లేదు.

– సత్యనారాయణ, రేవర్లబజార్

క: ఖాళీ ప్లాట్లలో ముళ్లపొదాలు మొక్కలు ఉంటే తక్షణమే తొలగిస్తాం. చెత్త తొలగించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం.

ప్ర: ఎనిమిది నెలల క్రితం దిద్దిపూడిలో సీసీ రోడ్డు కోసం తవ్వి వదిలేశారు. దీంతో గుంతల్లో వర్షపు నీరు నిలిచి ఇబ్బందిగా మారింది. – షేక్ మస్తాన్, 15వ వార్డు

క: రెండు రోజుల్లో గ్రామంలో పర్యటిస్తా, నీరు నిలిచిన ప్రాంతంలో జేసీబీతో తొలగించే ఏర్పాటు చేస్తాం. సీసీ రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలో నిర్మాణం చేపడతాం.

ప్ర: జాతీయ రహదారి పక్కనే తల్లాడ రోడ్డులోని గంధం టవర్స్ అపార్ట్‌మెంట్‌లో వ్యర్థాలు రోడ్డుపైకి వస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతుంది.

– పాలబోయిన కృష్ణకాంత్, షేక్ రసూల్

క: గంధం టవర్స్ సమస్య మున్సిపల్ కౌన్సిల్‌లో కూడా చర్చించాం. డ్రెయిన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. త్వరలోనే నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.

ప్ర: 8వ వార్డు బంక్‌కాలనీలో గత ఏడాది నుండి తాగునీటి సమస్య ఉంది. ఇక్కడ ట్యాంకు ఉన్నా సుమారు 100 కుటుంబాలరకు సరిపడా నీళ్లు రావడం లేదు. ఇకనైనా తాగునీటి సమస్యను పరిష్కరించండి. – వై.అశోక్, వైరా

క: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తాం. అమృత్ పథకం ద్వారా ఇటీవల రూ. 26 కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే సమస్య పరిష్కారవుతుంది.

ప్ర: 15వ వార్డులో ముస్లిం కాలనీలో కుక్కలు బెడద తీవ్రంగా ఉంది. వార్డులో పిచ్చి చెట్లు విపరీతంగా పెరిగి దోమలతో ఇబ్బందిగా ఉంది. – హజీబాబా, దిద్దిపూడి

క: మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కుక్కలను పట్టించేందుకు రాజమండ్రి నుండి సిబ్బంది వస్తున్నారు. మూడు రోజుల్లో అన్ని వార్డుల్లో కుక్కలను పట్టే ప్రక్రియ పూర్తవుతుంది. ఎక్కడైనాచెత్త పేరుకుపోతే తీయిస్తాం.

ప్ర: 9వ వార్డులో విపరీతంగా దోమలు ఉన్నాయి. సిబ్బంది రోజుల తరబడి ఫాగింగ్ చేయడం లేదు. ఇదేమిటని అడిగితే మాకు జీతాలు ఇవ్వడం లేదని చెబుతున్నారు.

– వి.నాని

క: వార్డుల్లో దోమల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. వర్షాలు తగ్గితే వెంటనే ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయిస్తాం. ఇబ్బంది లేకుండా చూస్తాం.

ప్ర: 15వ వార్డు ఎస్సీ కాలనీలో బోరు నుండి వచ్చే నీళ్లు రోడ్డుపై ఆగుతున్నాయి. నిలిచిన నీటి కారణంగా దోమలు పెరుగుతున్నాయి. రెండు నెలల నుండి ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. – కె.దేవదాస్

క: రోడ్డుపై నీళ్లు నిల్వకుండా ఏర్పాటుచేయిస్తాం. ఇందు కోసం బోరు చుట్టూ కూడా కాల్వ తవ్వించి నీరు సాఫీగా వెళ్లేలా చూస్తాం.

ప్ర: 9వ వార్డు ఎన్నెస్పీ కాల్వ పక్కన డ్రెయినేజీ కట్టారు. మరో వైపు డ్రెయిన్ లేకపోవడంతో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – షేక్ షరీఫ్

క: రోడ్డుపై నీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకుంటాం. త్వరలో రెండోపక్క కూడా సైడ్ డ్రెయిన్ నిర్మాణం కూడా చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం.

ప్ర: కూరగాయల మార్కెట్‌లో నీళ్లు ఆగిపోతున్నాయి. డ్రెయినేజీల లేకపోవడంతో ఈ సమస్య ఎదురవుతోంది. ఫలితంగా దోమలు పెరిగిన కొనుగోలుదారులు, వ్యాపారులు సమస్య ఎదుర్కొంటున్నారు. – పువ్వాళ్ల రాజా, వైరా

క: మార్కెట్‌లో నీళ్లు నిల్వకుండా చేస్తాం. దోమలు రాకుండా ఫాగింగ్ చేయిస్తాం.

తక్షణమే స్పందన

వైరా: 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్‌లో పలువురు సమస్యలను వివరించారు. దీంతో వైరా మున్సిపల్ కమిషనర్ చింతల వేణు తక్షణమే స్పందించారు. శనివారం సాయంత్రం వర్షం కురుస్తున్నా సిబ్బందితో కలిసి వార్డుల్లో పర్యటించి జేసీబీ, డోజర్లతో చెత్త, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగు తీయించారు. 1, 2వ వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేయించడంపై స్థానికులు సాక్షితో పాటు మున్సిపల్ కమిషనర్, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



వర్షపు నీరు వెళ్లేలా కచ్చా కాల్వ తీస్తున్న సిబ్బంది

'ధరణి' దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో భూవివాదాలతో పాటు ధరణి సంబంధిత సమస్యలపైనే ఎక్కువ దరఖాస్తులు వస్తున్న నేపథ్యాన వీటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ధరణి సహాయకేంద్రాన్ని శనివారం తనిఖీ చేసిన ఆయన ఫిర్యాదులు, పరిష్కారంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ధరణి సంబంధిత సమస్యల పరిష్కారం కోసం సహాయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడి సిబ్బంది దరఖాస్తు విధానం, సమర్పించాల్సిన ఆధారాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. మీ సేవా కేంద్రాల్లో సరైన నమూనాలో దరఖాస్తు చేసుకోకపోవడంతో తిరస్కరణకు గురవుతున్నందున సహాయక కేంద్రం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఇక్కడ దరఖాస్తులు తిరస్కరణకు గురైనా సిబ్బంది కారణాలను వెల్లడిస్తారని కలెక్టర్ తెలిపారు.

రైతుబీమా మార్గదర్శకాలు జారీ

- జిల్లాలో 15,074 మందికి కొత్తగా అవకాశం

ఖమ్మంవ్యవసాయం: రైతుబీమాకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన రైతులు పేర్లు నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. 2024 జూన్ 28లోపు ధరణి పోర్టల్ ద్వారా ధ్రువీకరించిన పాస్ పుస్తకాలు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పందిన రైతులను అర్హులుగా నిర్ణయించారు. ఆధార్ పోర్టల్‌ను అనుసరించి 18నుంచి 59ఏళ్ల నడుమ వయసు ఉండాలని నిర్దేశించారు. రైతుబీమాలో ఇప్పటివరకు 2,40,439 మంది రైతులు నమోదై ఉండగా, కొత్తగా 15,074 మంది అర్హత కలిగి ఉన్నారని తేలింది. అర్హులైన రైతులు ఆగస్టు 5లోగా పేర్లు నమోదు చేసుకోవాలని డీఏఓ విజయనిర్మల సూచించారు. పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఏఈఓలను సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

పెద్దవాగును పరిశీలించిన అదనపు కలెక్టర్



బోనకల్: పెద్దవాగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

బోనకల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బోనకల్ మండలంలోని వాగులు పొంగిపొర్లుతున్నాయి. చిన్నబీరవల్లి, రాపల్లి ప్రధాన రహదారిలో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు రెండు గ్రామాల మధ్య రాకపోకలను నిలిపివేశారు. ఈ నేపథ్యాన పెద్దవాగును అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శనివారం పరిశీలించారు. వాగు ఉధృతిపై రెండు గ్రామాల్లో చాటింపు వేయించి ఎవరూ రాకుండా చూడాలని తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ రాజును ఆదేశించారు.

ఇంజనీర్లు అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంఅర్బన్: జిల్లావ్యాప్తంగా జోరు వానల నేపథ్యాన ప్రాజెక్టులు, చెరువుల్లోకి భారీగా నీరు చేరుతోందని.. ఇప్పటికే కొన్ని చెరువులు అలుగు పోస్తున్నాయని నీటిపారుదలశాఖ సీఈ విద్యాసాగర్ తెలిపారు. ఈ నేపథ్యాన ఇంజనీర్లు అప్రమత్తంగా ఉండి తూముల లీకేజీలు జరగకుండా చూడాలని సూచించారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో చెరువులు, రిజర్వాయర్లను శనివారం పరిశీలించిన ఆయన స్థానిక ఇంజనీర్లకు సూచనలు చేశారు. డీసీఈ ధన్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఈ ఆనంద్ కుమార్, ఈఈలు ఎం.వెంకటేశ్వర్లు, శ్రీనివాస రెడ్డి, రామారావు ఉన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



సుజాత

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్ ఆర్ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ దొడ్డా సుజాతకు కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. 'జాబ్ శాటిస్‌ఫ్యాక్షన్ అండ్ వర్క్ మోటివేషన్ ఎమాంగ్ పోలీస్ పర్సనల్ ఇన్ తెలంగాణ స్టేట్'అంశంపై ఆమె కేయూ విశ్రాంత ప్రొఫెసర్ ఎస్.కమలేశ్వరరావు పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనా సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. సుజాతను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జకీరుల్లా, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బీవీ రెడ్డి, జీవన్‌కుమార్, అధ్యాపకులు శనివారం అభినందించారు.

అంగన్‌వాడీల ఖాతాల్లో నగదు జమ

సాక్షి ఎఫెక్ట్..

సత్తుపల్లిటౌన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ బోధన కోసం మూడేసి రోజుల చొప్పున శిక్షణ పొందిన టీచర్లకు టీ, భోజనానికి సంబంధించి ఖాతాల్లో నగదు జమ అయింది. అంగన్‌వాడీ టీచర్లకు బిల్లులు చెల్లించని విషయమై 'తిండిలో తొండి' శీర్షికన శనివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి స్పందించారు. శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ టీచర్ల బ్యాంక్ అకౌంట్ల వివరాలను సీడీపీఓల ద్వారా సేకరించగా.. శనివారం సాయంత్రకల్లా వారి ఖాతాల్లో నగదు జమ అయింది. అయితే, అంగన్‌వాడీ టీచర్లకు భోజనం సదుపాయం ఉండదని, అకౌంట్లలో నగదు జమ చేస్తామని ముందుగానే చెప్పామని డీడబ్ల్యూఓ తెలిపారు.


పెద్దాస్పత్రిలో వర్షపు ధారలు



వర్షపు నీరు కారే చోట పెట్టిన బకెట్లు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనం కొన్నేళ్లుగా కురుస్తోంది. చిన్నపాటి వర్షం వచ్చినా కురుస్తుండటంతో ఇబ్బందికరంగా మారుతోంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో పలు విభాగాల్లో శ్లాబ్ నుంచి నీరు ధారలుగా కారుతుండటంతో చికిత్స కోసం వచ్చిన వారే కాక సిబ్బంది అవస్థ పడుతున్నారు. అలాగే, శనివారం కొందరు జారి కింద పడినట్లు తెలిసింది. కొన్నిచోట్ల నీరు ఎక్కువగా పడుతుండటంతో బకెట్లు, థర్మకోల్ డబ్బాలు పెట్టి నిండగానే పారబోస్తున్నారు. పాతభవనం శిథిలావస్థకు చేరిన నేపథ్యాన ఏదైనా ప్రమాదం జరగకముందే ముందస్తు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పల్లె పాటల సందడి



పాట పాడుతున్న వెంకన్న, గాయకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం రాత్రి ఏర్పాటుచేసిన 'పల్లె పాటల ప్రస్థానంలో పాగి పాటకు పాతికేళ్ల'కార్యక్రమం సందడిగా సాగింది. గ్రామీణ ప్రాంత ప్రజల సంస్కృతి, జీవన విధానంపై జానపద గాయకుడు పాగి వెంకన్న పాతికేళ్లుగా పాడుతుండగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ముఖ్య అతిథిగా ప్రముఖ గాయకుడు గిద్దె రామనర్సయ్య మాట్లాడగా చిర్రా రవి అధ్యక్షత వహించారు. గాయకులు యశ్వంత్, మేడ శేషగిరి, రాజమౌళి, కొమిరె వెంకన్న, జి.వీరభద్రం, నిర్మల, పమ్మి రవి, ఎల్.రవికుమార్ పాల్గొన్నారు.

బదిలీలు ఉన్నట్టా.. లేనట్టా?

- త్రిశంకు స్వర్గంలో ఎక్సైజ్ ఉద్యోగులు
- మిగతా శాఖల్లో చివరి దశకు చేరిన ప్రక్రియ
- మంచి పోస్టింగ్ కోసం లాబీయింగ్ మొదలుపెట్టిన ఉద్యోగులు



ఖమ్మంక్రైం: ఉద్యోగులు బదిలీల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తుండగా ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆదేశాలతో కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఇదే సమయంలో ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు కూడా తమకు ఏళ్ల తర్వాత బదిలీ జరగనుందని సంతోషించారు. కానీ, ప్రభుత్వం అనుమతి ఇచ్చి కూడా ఇరవై రోజులు దాటడం.. పలు శాఖల్లో కౌన్సెలింగ్ చివరి దశకు చేరినా ఎక్సైజ్ శాఖలో బదిలీలపై కార్యాచరణ మొదలు కాకపోవడంతో వారిలో నిరాశ అలుముకుంది.

ఆరేళ్లుగా ఒకే ప్రాంతంలో..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పలు ఎక్సైజ్ స్టేషన్లలో హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఆరేళ్ల నుంచి ఒకేచోట పనిచేస్తున్నారు. వీరిలో 38 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 180 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. వారిలో కొందరు బదిలీ కోసం ఎదురుచూస్తుండగా.. మరికొందరు మాత్రం ఆదాయం ఉన్న స్టేషన్లు కావడంతో ఇక్కడే కొనసాగేలా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. ఇంకొందరు బదిలీ అయినా సరే మంచి స్టేషన్‌లో పోస్టింగ్ వచ్చేలా లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–2లో ఆరేళ్లుగా పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు మిగతా సిబ్బంది నడుమ విభేదాలు సృష్టిస్తూ అధికారులతో మాత్రం మంచిగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. 2017లో బూర్గంపాడులో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌ను ఖమ్మంకు తరలించి ఎక్సైజ్ స్టేషన్–2గా ఏర్పాటు చేశారు. అందులోని ఉద్యోగులు నేటికీ కొనసాగుతుండడం గమనార్హం.

మార్గదర్శకాలు ఏవీ?

గతంలో ఉద్యోగుల పనితీరు ఆధారంగా కేటగిరీలుగా విభజించి బదిలీ చేసేవారు. పనితీరు బాగున్న వారికి నగరాలు, పట్టణాల్లో పోస్టింగ్ ఇచ్చి, పనితీరు బాగాలేని సిబ్బందిని లూప్‌లైన్‌లో పెట్టేవారు. అయితే, ఈసారి ప్రభుత్వం అన్ని శాఖలకు ఒకే రీతిన మార్గదర్శకాలను విడుదల చేసినా ఎక్సైజ్ శాఖ విషయంలో ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది. దీంతో అసలు బదిలీలు ఉంటాయా, ఉండవా అన్న సందిగ్ధత నెలకొంది. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులను సంప్రదించగా.. ఒకటి, రెండు రోజుల్లో తమ శాఖలోనూ బదిలీలపై మార్గదర్శకాలు వచ్చే అవకాశముందని తెలిపారు.

ఉద్యాన శాఖలో పలువురికి స్థానచలనం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖలో పలువురు ఉద్యోగులకు బదిలీ జరిగింది. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ కార్యాలయం సహాయ సంచాలకులు అనితను మంచిర్యాల జిల్లాకు, మహబూబాబాద్ ఉద్యానాధికారి ఎ.విష్ణును మధిర ఉద్యాన అధికారిగా, డోర్నకల్ ఉద్యానాధికారి అనితశ్రీని ఖమ్మం ఉద్యాన శాఖ కార్యాలయానికి కేటాయించారు. నిర్మల్ ఉద్యానాధికారి ఆకుల వేణును వైరాకు, ఖమ్మం ఉద్యానాధికారి మీనాక్షిని సత్తుపల్లికి బదిలీ చేశారు. అంతేకాక జిల్లా ఉద్యాన కార్యాలయం సూపరింటెండెంట్ విజయలక్ష్మిని భద్రాద్రి జిల్లాకు, అక్కడి నుంచి విజయ్‌కుమార్‌ను ఖమ్మం కార్యాలయం సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

పశుసంవర్థక శాఖలో..

పశుసంవర్థక, పశువైద్య శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. సంస్థ రాష్ట్ర డైరెక్టర్ గోపి ఆన్‌లైన్‌లో శనివారం కౌన్సెలింగ్ చేపట్టారు. వెటర్నరీ అసిస్టెంట్లు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్లకు నిర్వహించిన కౌన్సెలింగ్ శనివారం రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగగా, ఆదివారం పశువైద్యాధికారుల బదిలీలు నిర్వహించనున్నారు.

జిల్లా ఉపాధి కల్పన అధికారిగా మాధవి



మాధవిని సన్మానిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంరాపర్తినగర్: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా ఉపాధి కల్పనాధికారిగా ఉన్న కొండపల్లి శ్రీరామ్ భద్రాద్రి జిల్లాకు బదిలీ కాగా వరంగల్‌లో విధులు నిర్వర్తిస్తున్న నల్లమోతు మాధవిని ఖమ్మంకు కేటాయించారు. ఈ సందర్భంగా ఆమె తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులు ఆమెను సన్మానించారు.

ఐసీడీఎస్‌లో బదిలీలు పూర్తి

ఖమ్మంవన్‌టౌన్: జిల్లాలో ఉన్న మహిళా శిశు సంక్షేమ శాఖలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. సాధారణ బదిలీల్లో భాగంగా ఎనిమిది మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టులు, ఆఫీస్ సబార్డినేట్లు ఐదుగురిని కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేసినట్లు జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. మొత్తం 15 మందికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆమోదంతో ఉత్తర్వులు జారీ చేశామని వెల్లడించారు. కాగా, జోనల్ స్థాయి పోస్టులైన గ్రేడ్–1 సూపర్‌వైజర్లు 18 మంది, గ్రేడ్–2 సూపర్‌వైజర్లు 9 మంది, నలుగురు సీనియర్ అసిస్టెంట్లు, మల్టీజోనల్ ఉద్యోగులైన సీడీపీఓ, ఏసీడీపీఓలు ఆరుగురికి రాష్ట్ర ఉన్నతాధికారులు బదిలీ ఉత్తర్వులను ఈ–మెయిల్ ద్వారా పంపారని తెలిపారు. వీరంతా నూతన స్థానాల్లో సోమవారం సాయంత్రంలోగా చేరాల్సి ఉంటుందని డీడబ్ల్యూఓ వెల్లడించారు.

మార్కెట్ అధికారులు..

ఖమ్మంవ్యవసాయం: మార్కెటింగ్‌శాఖ, వ్యవసాయ మార్కెట్లలో పనిచేసే పలువురు అధికారులు బదిలీ అయ్యారు. నల్లగొండ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీంను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేశారు. అయితే, ప్రస్తుతం ఆయన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఇన్‌చార్జ్ అధికారిగా పనిచేస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శి బి.బజారన్‌ను ఏన్కూరు మార్కెట్‌కు, ఏన్కూరు మార్కెట్‌లో పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును చర్ల, చర్ల మార్కెట్ నుంచి ఘనీని హుజూర్‌నగర్ మార్కెట్‌కు బదిలీ చేశారు. అలాగే, కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ మార్కెట్‌లో పనిచేస్తున్న సృజన్‌ను ఖమ్మంకు బదిలీ చేయగా ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉంది. కాగా, ఖమ్మం మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి నియామకంపై మాత్రం స్పష్టత రావాల్సి ఉంది.

మత్స్యశాఖలో..

జిల్లాలోని వైరా సీడ్‌ఫామ్ ఫిషర్‌మెన్ అక్బర్‌ను ఖమ్మం సారథినగర్‌లోని మత్స్యాభివృద్ధి కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే, ఖమ్మం కార్యాలయం వాచ్‌మెన్ నర్సింహారావు వైరా సీడ్ ఫామ్‌కు బదిలీ అయ్యారు.

ఇద్దరు ఎస్‌ఐలకు స్థానచలనం

ఖమ్మంక్రైం: జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమలాయపాలెం ఎస్‌ఐగా ఉన్న గిరిధర్‌రెడ్డిని మహబూబాబాద్ జిల్లా గూడూరుకు, ఖమ్మం టూటౌన్ ఎస్‌ఐ–2 పోలోజు కుషకుమార్‌ను కొత్తగూడ ఎస్‌ఐగా బదిలీచేశారు. వీరి స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అలాగే, మహబూబాబాద్ జిల్లా పెద వంగర ఎస్‌ఐ బి.మహేశ్‌ను ఖమ్మం వీఆర్‌కు కేటాయించారు.

సహకార, వ్యవసాయ శాఖల్లో బదిలీల బ్రేక్

ఖమ్మంవ్యవసాయం: రుణమాఫీ పథకం అమలు నేపథ్యాన సహకార, వ్యవసాయ శాఖల్లో అధికారులు, ఉద్యోగుల బదిలీలను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రభుత్వం విడతల వారీగా రుణమాఫీ ప్రక్రియను నిర్వహిస్తున్న క్రమంలో ఉద్యోగులను బదిలీ చేస్తే ఇబ్బంది తలెత్తుతుందనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 15 వరకు రుణమాఫీ జరగనుండగా, రైతుబీమా పథకంలో అర్హులను చేర్చే ప్రక్రియ ఆగస్టు 5న పూర్తికానుంది. ఈమేరకు రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులను బదిలీ చేయొద్దనే భావనకు వచ్చినట్లు తెలిసింది. ఇక సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు కూడా నిలిచిపోయాయి. ఈశాఖలోని 45 మంది అధికారులు, ఉద్యోగులకు డీసీసీబీ పరిధిలో రైతు రుణమాఫీ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడంతో బదిలీలకు బ్రేక్ పడింది.

పార్టీ వ్యతిరేకులను చేర్చుకోవడం సరికాదు..

కాంగ్రెస్ నాయకుడు దయానంద్



సీఎం చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న దయానంద్, నాయకులు

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని చేర్చుకోవాలని కొందరు చేస్తున్న ప్రయత్నాలు సరికాదని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం సత్తుపల్లి, వేంసూరు మండలాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాగమయి తప్ప ఎవరూ జోక్యం చేసుకోవాల్సిన పనిలేదని, కార్యకర్తలకు ఏ పని ఉన్నా తమ వల్ల కాకపోతే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వద్దకు తీసుకెళ్లి చేయించుకొస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిచోట్ల గెలిచిసేలా కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీని నమ్ముకున్న వారికి సొసైటీ, సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రాధాన్యత ఇస్తామని దయానంద్ తెలిపారు. కాగా, గత ప్రభుత్వంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను నిర్లక్ష్యంగా వదిలేయడంతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతుండగా సీఎం దృష్టికి ఎమ్మెల్యే రాగమయి తీసుకెళ్లి మంజూరు చేయించారని చెప్పారు. ఈ మేరకు సత్తుపల్లి, వేంసూరు మండలాల నాయకులు లబ్ధిదారులకు చెక్కులు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రుణమాఫీ అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులతో కలిసి పుష్పాభిషేకం చేశారు. నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, అట్లూరి సత్యనారాయణరెడ్డి, చల్లారి వెంకటేశ్వరరావు, వినుకొండ కృష్ణ, జక్కుల ప్రభాకర్, సతీశ్‌రెడ్డి, దోమా ఆనంద్, దొడ్డా శ్రీనివాసరావు, ఎండీ కమల్‌పాషా, విజయసారథిరెడ్డి, ఎస్‌కే బుడేన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఖమ్మంరూరల్/ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ సోమశేఖరశర్మ వెల్లడించారు. ఈ విషయాన్ని గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని సూచించారు. ఖమ్మం రూరల్ మండలంలోని జలగంగనగర్ ఉన్నత పాఠశాల, ఖమ్మం నయాబజార్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ వహిస్తూ వారిని తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. అయితే, తల్లిదండ్రులు కూడా బాధ్యతగా పిల్లల చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. కాగా, జలగంనగర్ పాఠశాల విద్యార్థులకు డీఈఓ డైరీలు, టైలు, బెల్టులు అందించారు. ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎం సుధారాణి, ఉపాధ్యాయులు విజయ్, సురేశ్, రామన్, రామారావు, గోపాల్, లక్ష్మి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ పెంచేవరకూ పోరాటం

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయ పనులు రోజురోజుకూ తగ్గుతున్న నేపథ్యాన ఉన్న పనికి సైతం సరైన కూలీ అందక పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బుర్రా ప్రసాద్, జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నేపథ్యాన కూలీ పెంపునకు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. వ్యవసాయ కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా ఏటా రూ.12 వేలు చెల్లించాలని, ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల సాధనకు ప్రజా సంఘాలను కలుపుకుని దశలవారీ పోరాటాలు చేస్తామని వారు తెలిపారు. నాయకులు యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేశ్, మాచర్ల భారతి, గణపతి, బోడపట్ల సుదర్శన్, పగడాల నాగేశ్వరరావు, సారంగి పాపారావు, గుమ్మడి భిక్షం, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

నాన్నకు ప్రేమతో...

రూ.80 వేలతో విగ్రహం చేయించిన కుమారులు



పరాంకుశరావు విగ్రహం

నేలకొండపల్లి: తండ్రి కన్నుమూసినా ఎప్పటికీ తమ కళ్ల ముందే ఉండాలనే తలంపుతో ఆయన కుమారులు విగ్రహాన్ని చేయించారు. ఇందుకోసం రూ.80వేలు వెచ్చించి అచ్చం తండ్రి రూపంలో విగ్రహాన్ని చేయించి ఆదివారం ఆవిష్కరణకు సిద్ధమయ్యారు. నేలకొండపల్లి మండలం బైరవునిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు గుండపనేని పరాంకుశరావు ఏడాది క్రితం మృతి చెందాడు. అయన కుమారులు రాంచందర్‌రావు, లక్ష్మణరావు ఎప్పటికీ తమ కళ్ల ముందే తండ్రి రూపం ఉండాలనే భావనతో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో రూ.80 వేలతో ఆయన విగ్రహం చేయించి తమ పొలంలో మందిరం నిర్మించారు. ఈ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బీఎస్‌ఎఫ్ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

సైనిక లాంఛనాలతో బాలాజీ అంత్యక్రియలు



బాలాజీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

కారేపల్లి: జ్వరంతో బాధపడుతూ మృతి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ తేజావత్ బాలాజీ అంత్యక్రియలు అయన స్వగ్రామమైన మండలంలోని భాగ్యనగర్ తండా గ్రామంలో నిర్వహించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో ఇండో టిబెట్ బోర్డర్ పోలీసు 9వ బెటాలియన్ హెడ్‌కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ)గా విధులు నిర్వర్తిస్తూ సెలవుపై వచ్చిన బాలాజీ జ్వరం బారిన పడి మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు అయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఆర్మీ అధికారులు నివాళులర్పించారు. అనంతరం సైనిక లాంఛనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. బాలాజీ మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తీసుకెళ్తుండగా స్థానికులు వందలాది మంది వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జై జవాన్ అంటూ నినాదాలతో పాల్గొన్నారు.

నలుగురు తహసీల్దార్ల బదిలీ

ఖమ్మంసహకారనగర్: సాధారణ బదిలీల్లో భాగంగా రెవెన్యూ ఉద్యోగులకు సైతం స్థానచలనం కలిగింది. ఈ మేరకు శనివారం ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్‌మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన వారితో స్పౌజ్ కేటగిరీల్లో నలుగురు తహసీల్దార్లను బదిలీకిఅర్హులుగా గుర్తించగా.. ముగ్గురిని ఇతర జిల్లాలకు కేటాయించారు. ఇంకో తహసీల్దార్‌కు పది నెలల సర్వీసే ఉండటంతో తిరిగి జిల్లాకే కేటాయించారు. ఈ మేరకు తహసీల్దార్లలో టి.గౌరీశంకర్‌ను హనుమకొండకు, పి.రాంప్రసాద్‌ను వరంగల్‌కు, మదన్‌గోపాల్‌ను మహబూబాబాద్ జిల్లాకు కేటాయించగా, కె.యోగీశ్వరరావును తిరిగి ఖమ్మం జిల్లాకే కేటాయించారు. ఇక డీటీల్లో రాగం యర్రయ్య మహబూబాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు.

కార్పొరేషన్ ఉద్యోగులు..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ విభాగాల ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వర్తిస్తున్న శంకర్, లాల్యాను ఇల్లెందు మున్సిపాలిటీకి, సీనియర్ అకౌంటెంట్ చంద్రకళను ఇల్లెందుకు, జూనియర్ అకౌంటెంట్ ఆశను వైరాకు, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌ను మహబూబాబాద్‌కు, జవాన్లు నలుగురిని సత్తుపల్లి మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

150 మంది సబ్జెక్టు టీచర్ల సర్దుబాటు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరతను తీర్చేందుకు అధికంగా ఉన్న పాఠశాలల నుంచి సర్దుబాటు చేశారు. ఈ మేరకు 150 మంది ఉపాధ్యాయులను గుర్తించగా శనివారం జాబితాను ఉన్నతాధికారులకు పంపించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో ఆమోదం రాగానే వారిని అవసరమైన పాఠశాలలకు కేటాయించనుండగా సబ్జెక్ట్ టీచర్ల కొరత తీరుతుందని వెల్లడించారు.

టైప్ రైటింగ్ పరీక్షలు ప్రారంభం

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే టైపు రైటింగ్ పరీక్షలు శని వారం ప్రారంభమయ్యాయి. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ పరీక్షలను ఖమ్మం ఎస్‌బీఐటీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు యూనియన్ బాధ్యులు వీరభద్రరావు, తిలక్, షేక్ బాబా తెలిపారు. జూనియర్, లోయర్, హయ్యర్, హైస్పీడ్ విభాగాల్లో పరీక్షలు నిర్వహిస్తుండగా తొలిరో జు హైస్పీడ్ విభాగంలో 550 మంది అభ్యర్థులు హాజరయ్యారని వెల్లడించారు.

రెండు కేంద్రాల్లో డీఎస్సీ పరీక్ష

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయ నియామకాలకు నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు శనివారం మూడో రోజుకు చేరాయి. అయితే, అభ్యర్థుల సంఖ్య ఆధారంగా రెండు కేంద్రాల్లోనే పరీక్ష నిర్వహించారు. ఉదయం సెషన్‌లో 193 మందికి 148 మంది, మధ్యాహ్నం పరీక్షకు 172 మందికి గాను 64 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

సత్తుపల్లిటౌన్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైన ఘటన సత్తుపల్లిలో శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని మసీద్‌రోడ్డులో డి.వరలక్ష్మి పెంకుటింట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అయితే, వరలక్ష్మి తాళంవేసి హైదరాబాద్ వెళ్లడంతో స్థానికులు మంటలను గుర్తించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఫైర్ ఆఫీసర్ ఐ.చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఎం.వెంకటేశ్వరరావు, యు.వెంకటేశ్వరరావు, రాజేందర్, బాబూరావు చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఇంటి స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై కేసు

చింతకాని: మండలంలోని గాంధీనగర్‌కాలనీలో జర్నలిస్ట్‌కు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాన్ని ఆక్రమించిన నలుగురిపై శనివారం కేసు నమోదైంది. జర్నలిస్ట్ రామారావుకు కేటాయించిన ఇంటి స్థలాన్ని అదే గ్రామానికి చెందిన చల్లా రఘుపతి, ఆయన భార్య తిరుపమ్మ, కుమారుడు వెంకటేశ్, కుమార్తె నర్సమ్మ ఆక్రమించి సిమెంట్ రేకులతో షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దూషించడమే కాక స్థలంలోకి వస్తే చంపుతామని బెదిరించారు. దీంతో రామారావు చేసిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

పెద్దాస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం?

పాము కాటుతో వచ్చిన వృద్ధురాలిని పట్టించుకోని వైనం



వెంకటమ్మ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓ రాంబాబు, డాక్టర్ రాంప్రసాద్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ వైద్యంపై నమ్మకంతో వచ్చేవారి విషయంలో జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యులు కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా ఇలాంటి ఘటన వెలుగు చూసింది. ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరికి చెందిన బి.వెంకటమ్మ శుక్రవారం పొలంలో పనిచేస్తుండగా పాము కాటు వేయడంతో కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. తొలుత క్యాజువాలిటీకి వెళ్లగా వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఓపీ చీటీ రాయడానికి పావు గంట సమయం తీసుకోవడమే కాక టెస్టులు చేయించుకోని రావాలని తాత్సారం చేశారని ఆరోపించారు. ఈ సమయాన ముగ్గురు వైద్యులు ఒకేచోట కూర్చుని మాట్లాడుకుంటూ పాము కరిచి నడవలేని స్థితిలో ఉన్న వెంకటమ్మను పట్టించుకోలేదని తెలిపారు. కాగా, రోగులు, వారి సహాయకులకు వైద్యులు, సిబ్బంది కనీస మర్యాద ఇవ్వకపోవడంతో తరచూ వాగ్వాదం జరుగుతోంది. ఈ మేరకు వెంకటమ్మ బంధువులు తీసిన వీడియో వైరల్ అయింది. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, ప్రజల్లో అపోహలు సృష్టించేలా తీసిన వీడియోలను నమ్మొద్దని కోరారు. వెంకటమ్మకు సకాలంలో జనరల్ మెడిసిన్ వైద్యులు రాంప్రసాద్, డాక్టర్ ప్రియాంక వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు.

యావత్ దేశం దృష్టికి ఆటవిక పాలన

24న ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిద్దాం : వైఎస్ జగన్

మనతో కలసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకుని పోరాటం చేద్దాం

ఏపీలో సాగుతున్న దారుణకాండను వారికి వివరిద్దాం

- ఢిల్లీ ధర్నా తర్వాత పార్లమెంటు ఉభయసభల్లోనూ గళమెత్తాలి.. రాష్ట్రంలోని ఘటనలతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం.. అందుకే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తున్నాం
- అదే విషయంపై పార్లమెంటులో నినదించాలి.. అలా చంద్రబాబుకు గట్టి హెచ్చరికలు పంపాలి
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ సమావేశంలో ఎంపీలకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ దిశానిర్దేశం



“ఢిల్లీలో ధర్నా కార్యక్రమానికి అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నాం. ఈ పోరాటంలో మనతో వచ్చే అన్ని పార్టీలను కలుపుకుని పోదాం. ధర్నాలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులంతా పాల్గొంటారు. రాష్ట్రంలో కొనసాగుతున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్దాం. రాష్ట్రంలో గత 45 రోజులుగా ఏం జరుగుతోందో వివరిద్దాం. ధర్నా అనంతరం పార్టీ ఎంపీలు పార్లమెంట్‌కు హాజరవ్వాలి. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసంపై ఉభయ సభల్లో గట్టిగా మాట్లాడాలి. ఇక్కడ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న దురాగతాలను అందరి దృష్టికి తీసుకెళ్లాలి.

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీలో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు సృష్టిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో ఈ నెల 24వ తేదీ బుధవారం నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. గత 45 రోజులుగా రాష్ట్రంలో ఏం జరుగుతోందో వివరించి.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంలో కలిసి వచ్చే అన్ని పార్టీలనూ కలుపుకుపోదామని ఎంపీలకు సూచించారు. ధర్నా అనంతరం పార్లమెంట్‌కు హాజరై రాష్ట్రంలో సాగుతున్న ఆటవిక పాలనపై గళమెత్తాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్షతో చేస్తున్న దురాగతాలను తమ సభల్లోని సభ్యులందరి దృష్టికి తీసుకెళ్లాలని ఉద్బోధించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ఆయన తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసులో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. ‘ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి అపాయింట్‌మెంట్లు కోరాం. అపాయింట్‌మెంట్లు రాగానే.. వారికీ ఇక్కడి పరిస్థితిని వివరిస్తాం. ఢిల్లీలో ధర్నా, నిరసన కార్యక్రమానికి సంబంధించి ఒక్కో ఎంపీ ఒక్కో బాధ్యత తీసుకోవాలి. వెంటనే ఢిల్లీ వెళ్లి ఆ పనుల్లో నిమగ్నం కావాలి. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు ప్రజల్లో మరింత ఆగ్రహానికి దారి తీస్తున్నాయి. అందుకే రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేస్తున్నాం. అలా చంద్రబాబుకు గట్టిగా హెచ్చరికలు పంపాలి. పోరాటం చేయకపోతే దారుణాలకు అడ్డుకట్ట పడదు. అసెంబ్లీ సమావేశాల్లోనూ నిరసన వ్యక్తం చేస్తాం. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాష్ట్రంలో దారుణాలు, అరాచకాలు, ఇక్కడ జరుగుతున్న ఘటనలపై అందరూ గళమెత్తాల్సిన అవసరం ఉంది’ అని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రజాస్వామ్య మనుగడకే పెను ప్రమాదం

రాష్ట్రంలో జరుగుతున్న ఈ ఘటనలు ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదు. అవి ప్రజాస్వామ్య మనుగడకు పెద్ద దెబ్బ. అందుకే అన్ని పార్టీలకూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల గురించి వివరించాలి. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మీద దారుణంగా దాడులు జరుగుతున్నాయి. వినుకొండలో రషీద్ హత్యే ఇందుకు పరాకాష్ట. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డు మీద కత్తితో నరికి చంపిన తీరు అత్యంత అమానుషం. ఆ రాజకీయ హత్య ఘటనను వక్రీకరించడానికి ఎల్లో మీడియా సహాయంతో ప్రభుత్వం నానా ప్రయత్నాలు చేస్తోంది. ఏదో బైక్ కాల్చిన ఘటనకు, ఇప్పుడు జరిగిన దారుణ హత్యకు ముడి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అసలు తమ కొడుకు ఏం తప్పు చేశాడని రషీద్ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ‘సీఎంగా వైఎస్ జగన్ ఉంటే.. అంతా మంచి జరుగుతుందని నమ్మడం మా తప్పు అవుతుందా?’ అని వారు ప్రశ్నిస్తున్నారు. హంతకుడైన జిలానీ.. లోకేశ్ పుట్టిన రోజున, స్థానిక ఎమ్మెల్యే భార్యకు స్వయంగా కేక్ తినిపించిన ఫొటోలను రషీద్ తల్లిదండ్రులు చూపారు. స్థానిక ఎమ్మెల్యేతో కూడా కలిసి దిగిన హంతకుడి ఫొటోలను వారు చూపించారు.

హత్యలు.. హత్యాయత్నాలు.. విధ్వంసాలు

పల్నాడు జిల్లాకు కొత్త ఎస్పీ వచ్చిన రెండు మూడు రోజుల్లోనే హత్యతో సహా పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. అంతకు ముందు మల్లికా గార్గ్ జిల్లా ఎస్పీగా ఉన్నారు. ఆమె సమర్థురాలు. అందుకే ఆమెను ఉద్దేశ పూర్వకంగా బదిలీ చేశారు. తమకు అనుకూలంగా ఉండే ఎస్పీని నియమించుకుని ఈ దారుణాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ 45 రోజుల్లో 36 మంది రాజకీయ హత్యలకు గురయ్యారు. 300కు పైగా హత్యాయత్నాలు జరిగాయి. తెలుగుదేశం పార్టీ వారి వేధింపులు భరించలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 560 చోట్ల ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు. 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు సైతం ధ్వంసం చేశారు. ఇవి కాక 1000కి పైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయి.

ఎంపీపైనా యథేచ్ఛగా దాడి

మరోవైపు తన సొంత పార్లమెంటు నియోజకవర్గంలో, తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలోనే ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడులు చేశారు. కావాలనే అక్కడ టీడీపీ మనుషులు ఉండేలా, పోలీసులతో ప్లాన్ చేసి మరీ దాడులు చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్ప ఒక న్యాయవాది. ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరులో ఆయన ఇంటికి వెళ్తే, రాళ్లతో దాడి చేసి.. వాహనాలు కూడా ధ్వంసం చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్పకు చెందిన వాహనాన్ని దగ్ధం చేశారు. అన్ని తప్పులు చేసిన వారే, తిరిగి మన పార్టీ వాళ్ల మీద కేసులు పెడుతున్నారు.

ప్రజాస్వామ్యానికి విలువ ఉంటుందా?

రాష్ట్రంలో 15 ఏళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రస్థానం సాగుతోంది. చంద్రబాబు ఆశించి నట్టుగా వైఎస్సార్‌సీపీని అణగదొక్కలేరు. ఎవరు అధికారంలో ఉన్నా ఇలాంటి దాడులు మంచివి కావు. అధికారంలో ఉన్న పార్టీ, అధికారంలో లేని పార్టీ మీద దాడులు చేయడం ధర్మమా? ఇలాగైతే ప్రజాస్వామ్యానికి విలువ ఏముంటుంది? గత ఎన్నికల్లో మనం 86 శాతం సీట్లను గెలిచాం. అయినా ఇలాంటి ఘటనలు జరగలేదు. దాడులను ఎప్పుడూ ప్రోత్సహించలేదు. ప్రజలందరినీ సమానంగా చూశాం. ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు కాకపోవడంపై ఎవ్వరూ ప్రశ్నించకూడదన్నదే ఈ ప్రభుత్వ ఉద్దేశం. దీనిపై ఎవరూ నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు చేయకూడదన్నదే ప్రభుత్వ ఆలోచన. అందుకే దగ్గరుండి విధ్వంసకాండను ప్రోత్స హిస్తున్నారు. పార్టీకి కార్యకర్తలు చాలా ముఖ్యం. ఎక్కడ కార్యకర్తలకు నష్టం జరిగినా వెంటనే స్పందించడం, వారిని కాపాడు కోవడం మన బాధ్యత. ఆయా కుటుంబాలకు తోడుగా నిలవాలి. కార్యకర్తలందరి తరఫున గట్టిగా నిలబడాలి.

హైస్కూళ్ల పనివేళల్లో మార్పు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాఠశాలల పనివేళలను రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసింది. ఉన్నత పాఠశాలలు ప్రస్తుతం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వర కు కొనసాగుతుండగా.. ఈ సమయాన్ని అరగంట ముందుకు జరిపింది. ఇకపై ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.15 గంటలకు ముగుస్తాయి. కాగా, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రస్తుతం కొనసాగుతున్న సమయాలను యథావిధిగా ఉంచిన ప్రభుత్వం.. ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో హైదరాబాద్ జంటనగరాల్లో కూడా ప్రస్తుతం ఉన్నట్టుగానే ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారులను, ప్రాంతీయ సంయుక్త సంచాలకులను ఆదేశించారు.

31 వరకు ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు

బదిలీల షెడ్యూల్ పొడిగింపు.. ఆర్థిక శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల షెడ్యూల్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 3వ తేదీన ఇచ్చిన జీవో ప్రకారం శనివారంతో బదిలీల షెడ్యూల్ ముగియాల్సి ఉండగా.. ఈనెల 31 వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తికాని నేపథ్యంలో.. గడువును పొడిగిస్తున్నట్టు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివా రం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి సాధారణ బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దాశరథి పురస్కారానికి జూకంటి జగన్నాథం



సాక్షి, హైదరాబాద్: కవి, కథకుడు జూకంటి జగన్నాథంకు రాష్ట్రప్రభుత్వం దాశరథి కృష్ణమాచార్య పురస్కారం ప్రకటించింది. ఈమేరకు శనివారం రాత్రి ఉత్తర్వు జారీ చేసింది. పురస్కార కమిటీ రెండు రోజుల క్రితం భేటీ అయి జూకంటి జగన్నాథం పేరును సిఫారసు చేసింది. ఆయన పేరును ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. త్వరలో జూకంటికి పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనను రూ.లక్షా వేయి నూట పదహార్లు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించనున్నారు.

అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య పెరిగేలా కార్యాచరణ

- అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విస్తారంగా ఉన్న ప్రకృతి వనరులను జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఐటీ ఉద్యోగులు ఆయా పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపేలా వాటిని అభివృద్ధి చేసే కార్యాచరణ రూపొందించాలని సూచించారు. శనివారం ఆయన పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి బడ్జెట్ సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగురోడ్డు పరిసరాలు, జలాశయాలు, అడవుల వంటి ప్రాంతాలను పర్యాటకులకు స్వర్గధామంలా రూపొందించే అవకాశం ఉందని, ఆ దిశలో చర్యలు తీసుకోవాలని అధికారులను భట్టి ఆదేశించారు. సాంస్కృతిక సారథి కళాకారుల కార్యక్రమాలపై ఆరా తీశారు. సమాజాభివృద్ధికి వారి సేవలను సమగ్రంగా వినియోగించుకునే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలోని క్రీడా మైదానాలను మెరుగుపరిచి, సంవత్సరం పొడవునా వాటిలో యాక్టివిటీ ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యార్థులకు వాటిల్లో క్రీడాపోటీలు నిర్వహించాలని, అవి ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు.

సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారి రిజ్వీ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి శ్రీధర్, హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికేరి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

నేడు పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని ఈఓ పేర్కొన్నారు.


ఆర్‌సీఓల స్థానంలో జోనల్ ఆఫీసర్లు

- ఖమ్మం జోనల్ ఆఫీసర్‌గా స్వరూపరాణి

నేలకొండపల్లి: ఎస్సీ గురుకులాల పర్యవేక్షణకు ఇన్నాళ్లు కొనసాగుతున్న రీజినల్ కోఆర్డినేటర్ల (ఆర్‌సీఓ)ల స్థానంలో జోనల్ ఆఫీసర్లను నియమిస్తున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మం ఆర్‌సీఓగా ఉన్న ప్రత్యూషను బదిలీ చేస్తూ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ వైస్ చైర్మన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను కరీంనగర్ బదిలీ చేయడంతో పాటు ఖమ్మం గురుకుల పాఠశాలల జోనల్ ఆఫీసర్‌గా కరీంనగర్ ఆర్‌సీఓగా ఉన్న కె.స్వరూపారాణిని నియమించారు. కాగా, స్వరూపారాణి గతంలో నేలకొండపల్లి, ఖమ్మం అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించారు.

స్తంభాన్నే తలదన్నేలా!

వేపకుంట్లలో 14 అడుగులు పెరిగిన జొన్నచెట్టు



రఘునాథపాలెం మండలం వేపకుంట్లలో మిట్టకోలు వేలాద్రి ఇంటి ఆవరణలో జొన్న మొక్క 14 అడుగుల మేర ఎత్తు పెరిగింది. పక్కనే విద్యుత్ స్తంభానికి మించి చెట్టు పెరగడంతో చెట్టును స్థానికులు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ఈ చెట్టు ఏడాదిన్నరగా పెరుగుతూ ప్రస్తుతం స్తంభాన్ని దాటేసిందని వేలాద్రి తెలిపారు.

– రఘునాథపాలెం

రైతులారా.. పంటలు జాగ్రత్త

- ఎడతెరిపి లేని వర్షంతో చేలలో నిలిచిన నీరు
- చీడపీడలు సోకకుండా అప్రమత్తత అవసరం



కొణిజర్ల సమీపాన పత్తి చేనులో నిలిచిన నీరు

మధిర: వారం రోజులుగా జిల్లా అంతటా ఎడతెరిని లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యాన కంది, పత్తి, మినుము, పెసర తదితర పంట చేన్లలో నీరు నిలిచింది. ఈ మేరకు పోషక పదార్థాల లోపం ఏర్పడి చీడలు, తెగుళ్ల, కలుపు సమస్య పెరిగే అవకాశముంది. ఇందులో భాగంగా రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్త డాక్టర్ టి.భరత్ వెల్లడించారు.

వరి

వరి నారుమడిలో కలుపు యాజమాన్యం ఆటంకంగా మారుతుంది. బిస్ పైరిబాక్ సోడియం మందు 0.5 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి విత్తిన 8–10 రోజుల్లో పిచికారీ చేసుకోవాలి. నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డి జాతి కలుపు ఉంటే విత్తిన 15–20 రోజులకు సైహలోపాప్–పీ–బ్యూటైల్ మందు 1.5 మి.లీ.ను లీటర్ నీటి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. అలాగే, అధిక వర్షాలతో ఇనుప ధాతు లోపాన్ని గమనిస్తే పంట, మొక్క వయసు ఎదుగుదల ఆధారంగా 2–5 గ్రాములు అన్నభేది, 0.5 నుంచి ఒక గ్రాము నిమ్మ ఉప్పును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు తీసే ఏడు రోజుల ముందు గుంట నారుమడికి 200 గ్రాములు కార్బోప్యూరాన్ గుళికలు కేజీని ఇసుకలో కలిపి చల్లి పలుచగా నీరు ఉంచాలి. ఇక జింకు లోపం గమనిస్తే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

మినుము, పెసర

అధిక వర్షాలతో సాధారణంగా శాఖీయ పెరుగుదల అధికంగా ఉంటుంది. తద్వారా ఆకురొట్ట ఎక్కువగా ఉండి పొగాకు లద్దె పురుగు ఆశించి నష్టపరుస్తుంది. ఈ మేరకు జిల్లేడు ఆకులు కనబడితే లద్దె పురుగు ఆశించినట్లుగా గుర్తించి వెంటనే గుడ్ల సముదాయం, పిల్ల పురుగులు ఉన్న జిల్లేడు ఆకులను తీసివేయాలి. తొలిదశలో లార్వా నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్వినాల్‌ఫాస్ 3 మి.లీ.ను, ఎదిగిన లార్వా నివారణ కోసం థయోడికార్బ్ ఒక గ్రామును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మినుము, పెసరలో తామర పురుగులు పైరు లేత దశలో ఎక్కువ ఆశించి ఆకుల్లో రసాన్ని పీల్చి నష్టాన్ని కలగజేయడమే కాకుండా ఆకుముడత వైరస్‌ను వ్యాపింపజేస్తాయి. దీని నివారణకు ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెల్ల దోమ గమనిస్తే నివారణకు 0.2 గ్రాముల ఎసిటామిప్రిడ్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అధిక వర్షాలతో ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందే అవకాశముంది. దీని నివారణకు కార్బన్‌డిజం లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పెసర పూత దశలో ఉంటే అధిక తేమ వలన పూత రాలిపోయే అవకాశం ఉంటుంది. దీనిని అరికట్టేందుకు ప్లానోఫిక్స్ ఒక మి.లీ.ను 4.5 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. అంటే ఎకరానికి 40 మి.లీ. ప్లానోఫిక్స్ సరిపోతుంది.

కంది

అధిక వర్షాలకు అంతర కృషి కష్టమవుతుంది. ఈ నేపథ్యాన కలుపు నివారణకు విత్తిన 20 రోజులకు ఇమజితాఫర్ 300 మి.లీ. ఎకరానికి అంటే 1.5 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేస్తే గడ్డి, వెడల్పు ఆకు కలుపు నివారించవచ్చు. కంది పంట నీటి ముంపును తట్టుకోలేదని గుర్తించి పంటలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలి. బోదె కాల్వ పద్ధతిలో విత్తుకుని వర్షం నీరు ఇంకిపోయేలా చేయాలి.

పత్తి

అధిక వర్షాలతో నిలిచిన నీటిని తక్షణమే పత్తి చేను నుంచి తీసివేయాలి. పైపాటుగా పోషకాలు అందించేందుకు 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్ 13:0:45 లేదా యూరియా 10 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. అధిక వర్షాలతో ఎక్కడైనా మొక్కలు ఎండిపోవడం గమనిస్తే అక్కడ కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బన్‌డిజమ్ ఒక గ్రామును లీటర్ నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు మొక్కల అడుగుభాగం తడిచేలా పిచికారీ చేయాలి. అంతర కృషి చేయలేకపోతే గడ్డి జాతి కలుపు నివారణ కోసం ఎకరానికి క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ. లేదా ప్రొఫాక్విజాపాప్ 250 మి.లీను ఎకరానికి పిచికారీ చేయాలి. గడ్డిజాతి, వెడల్పు ఆకు కలుపు నివారణకు క్విజలోఫాఫ్ ఇథైల్ 400 మి.లీ.తో పాటు పైరిథయోబ్యాక్ సోడియం 250 మి.లీను ఎకరానికి పిచికారీ చేసుకోవాలి. పంట 2 లేదా 4 ఆకుల దశలో పిచికారీ చేస్తే కలుపు నివారణ బాగుంటుంది. పేనుబంక, పచ్చ దోమ తదితర రసం పీల్చే పురుగుల నివారణకు కాండానికి మందుపూత పద్ధతి అవలంబించాలి. కాన్ఫిడార్ లేదా ఫ్లానికామిడ్, నీరు 1:20 నిష్పత్తిలో 30, 45, 60 రోజుల్లో ఉపయోగించి రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చు. పచ్చిరొట్టగా జీలుగు వేసిన రైతులు పూత దశలో ఉన్నప్పుడు కలియదున్ని ఎకరాకు 150 కిలోల చొప్పున సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేస్తే జీలుగ తొందరగా మురగడంతో పాటు చివరి దశలో భాస్వరం ఎరువు వేయాల్సిన అవసరం ఉండదు.

డీసీఎంఎస్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) అభివృద్ధికి కృషి చేస్తున్నామని చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన పాలక వర్గ సమావేశంలో కొత్వాల మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధి కోసం వ్యాపారాలను విస్తృతం చేయాల్సిన అవసరముందని చెప్పారు. ఇందులో భాగంగా రైతులకు ప్రయోజనం చేకూరుస్తూనే సంస్థ ఆర్థికాభివృద్ధికి అవసరమైన కార్యకలాపాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీతో రైతులకు ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు. సమావేశంలో డైరెక్టర్లు పరుచూరి రవికుమార్, జక్కుల లక్ష్మయ్య, కంచరపు వెంకటేశ్వర్లు, తోళ్ల కోటయ్య, బిజినెస్ మేనేజర్ కె.సందీప్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎండీ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన కొత్వాలను డైరెక్టర్లు సన్మానించారు.

నేడు దమ్మక్క స్మృతి యాత్ర

- గిరి ప్రదక్షిణ, ప్రత్యేక పూజలు
- చర్ల మండలంలో గిరిజనుల సమక్షాన రామయ్య కల్యాణం



దమ్మక్క విగ్రహం

భద్రాచలం: అందరి బంధువైన శ్రీసీతారామచంద్ర స్వామి అపర భక్తురాలైన పోకల దమ్మక్కను స్మరించుకుంటూ స్మృతియాత్రను భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించనున్నారు. 2014 నుంచి ఏటా ఆషాఢ మాసంలో దమ్మక్క సేవా యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గిరిజనులను స్వామి పూజలో భాగస్వాములను చేయడం ఈ ఉత్సవ ప్రత్యేకత. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 6.30 గంటలకు దమ్మక్క చిత్రపటంతో భద్రగిరి ప్రదక్షిణ, టూరిజం హోటల్ వద్ద ఉన్న దమ్మక్క విగ్రహానికి వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి పూజలు నిర్వహిస్తారు. కాగా, గిరిజనులు బేడా మండపంలో స్వామికి పండ్లు సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొంటారు. అయితే, ఈసారి చర్ల మండలం ఆర్.కొత్తగూడెంలోని రామాలయంలో గిరిజనుల సమక్షాన కల్యాణం జరిపించాలని నిర్ణయించారు. ప్రచార రథంలో స్వామి వార్ల ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి కల్యాణం, అన్నదానం జరుపుతున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. అలాగే, ఆదివారం సాయంత్రం భద్రాచలం తాతగుడి సెంటర్ వద్ద ఆలయంలో గోవిందరాజ స్వామి కల్యాణం జరుగుతుందని వెల్లడించారు.

రేపు రామాలయ హుండీ లెక్కింపు

భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. చిత్రకూట మండపంలో జరిగే లెక్కింపునకు ఆలయ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు హాజరుకావాలని సూచించారు.

‘రాయల’ కుటుంబానికి ఎంపీ పరామర్శ



చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

తిరుమలాయపాలెం/ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల మృతి చెందిన మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ కుటుంబాన్ని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శనివారం మండలంలోని పిండిప్రోలులో పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆయన భార్య విమల, కుమారుడు పావెల్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రాయల రాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఇటీవల అస్వస్థతకు గురై చికిత్స చేయించుకున్న మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీని ఖమ్మంలో ఎంపీ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం ఉన్నారు.

28 నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

చర్ల: ఈ నెల 28 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. అంతే కాకుండా అమాయక ఆదివాసీలపై కొనసాగుతున్న ప్రతిఘాతుక కగార్ ఆపరేషన్‌ను ప్రజా ఉద్యమాల ద్వారా ఓడించాలని ఆయన శనివారం విడుదల చేసిన లేఖలో వెల్లడించారు. నక్సల్బరీ, సాయుధ రైతాంగ తిరుగుబాటు నుంచి ఇప్పటివరకు నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం ప్రజాయుద్ధం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో చారు మజుందార్, కనాయ్ చటర్జీ తదితర నేతలెందరో అమరులయ్యారని, వీరి నేతృత్వంలో విప్లవోద్యమం పురోగమిస్తూ అనేక మంది ప్రజలు ప్రాణాలర్పించారని తెలిపారు. గత ఏడాది 194 మంది ప్రభుత్వ ప్రతిఘాతుక చర్యల్లో బలికాగా, అమరులను స్మరించుకుంటూ ఈ నెల 28న అమరవీరుల సంస్మరణ దినం పాటించడంతో పాటు ఆగస్టు 3 వరకు సంస్మరణ వారోత్సవాలు జరుకోవాలని పిలుపునిచ్చారు.